క్లుప్తంగా

అయోధ్య సెట్‌తో వినాయక చవితి వేడుకలు

ఎంవీపీకాలనీ: అయోధ్యలోని రామాలయం తరహా సెట్‌తో ఈ ఏడాది వినాయక చవితి వేడుకలు నిర్వహించనున్నట్లు యూత్ ఐకాన్ సంస్థ వెల్లడించింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు చెందిన గ్రౌండ్‌లో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని నోవోటెల్ సమీపంలో చాక్లెట్ వినాయకుడిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది అయోధ్య తరహాలో సెట్ వేసి బాల వినాయకుడిని ప్రతిష్టిస్తామని చెప్పారు. ప్రత్యేకమైన ఈ వినాయకుడి దర్శనం ద్వారా విశాఖ భక్తులు మంచి అనుభూతిని పొందుతారన్నా రు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కనకరాజు, టీడీపీ నాయకులు పట్టాభి, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

20న గిరిప్రదక్షిణ భక్తులకు ప్రసాద వితరణ

మహారాణిపేట: ఈ నెల 20న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేయాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం నిర్ణయించింది. 14 ఏళ్ల నుంచి ఈ ఫోరం ఆధ్వర్యంలో మురళీనగర్, అయ్యప్పనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఫోరం ప్రతినిధులు సింగూరి నర్సింగరావు, భూపతి సత్యనారాయణ, గుండు వెంకటేష్, పట్నాల నాగ వెంకట రామ్మోహన రెడ్డి తెలిపారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఇడ్లీ, టమాటా బాత్, మిరియాల పాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి భక్తులకు ప్రసాదం అందజేస్తామని రామ్మోహన రెడ్డి చెప్పారు.

45 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా. ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోల్‌కతాకు చెందిన జునైద్, ఎం.డి.ఇమ్రాన్, బెంగళూరుకు చెందిన మహ్మద్ కలీద్‌లు బెంగళూరులోని విక్టోరియా హాస్పిటల్లో పనిచేస్తున్నారు. వీరు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరుకు తరలించే క్రమంలో విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం ఈ ముగ్గురిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు. వీరి వద్ద నుంచి 45 కిలోల గంజాయి, రెండు సూట్‌కేసులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళా ఎస్‌ఐ ప్రమీల కేసు నమోదు చేశారు.

ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విజయనగరం ఎంపీ అప్పలనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హేమంత్‌కుమార్

ఆరిలోవ: ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ కోరారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్‌సిటీ ప్రాంతానికి బుధవారం ఎంపీ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను హేమంత్‌కుమారుతో పాటు కొందరు నిరుద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలపై ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పొట్నూరు వెంకటకృష్ణారావు, సేనాపతి రమణ, పతివాడ పాపారావు తదితరులు ఉన్నారు.

రోగుల కష్టాలు మళ్లీ మొదలు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు మొదలయ్యాయి. పీహెచ్‌సీల్లో వైద్యం పొందాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలను ఆధునికీకరించడంతో పాటు అదనంగా అర్బన్ పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచిన విషయం తెలిసిందే. దీంతో వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు ఆయా వైద్య నిపుణులు సేవలను అందించేవారు. వారిని ప్రస్తుత ప్రభుత్వం తొలగించడంతో రోగులకు ప్రభుత్వం వైద్యం అంతంత మాత్రమైపోయింది.

- స్పెషలిస్టులను తొలగించిన ప్రభుత్వం
- ఒకే వైద్యుడితో సేవలు
- తగ్గుతున్న ఓపీ
- రోగులకు తప్పని అవస్థలు

ఆరిలోవ: ప్రజలకు చేరువలో ఉన్న యూపీహెచ్‌సీలలో వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి. స్పెషలిస్ట్ వైద్యుల సేవలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు లేక యూపీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. గతంలో రోజులో సుమారు 100 వరకు ఉండే ఓపీ ఇప్పుడు 50 కంటే తక్కువగా నమోదవుతోంది.

తూర్పు నియోజకవర్గంలో రూ.8 కోట్ల నిధులతో ఎనిమిది చోట్ల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో యూపీహెచ్‌సీ నిర్మాణం, వాటిలో వైద్య పరికరాలు, మందులు, ల్యాబ్ తదితర వాటి కోసం రూ.కోటి చొప్పున ఖర్చు చేసింది. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించేవారు. జీవీఎంసీ జోన్–2 పరిధిలో 4 యూపీహెచ్‌సీలు ఉండగా జోన్–3 పరిధిలో మరో 4 యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. జోన్–2 పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్, 11వ వార్డు బాలాజీనగర్, 13వ వార్డు ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురంలో యూపీహెచ్‌సీలు ఉన్నాయి. జోన్–3 పరిధి 15వ వార్డు మద్దిలపాలెం, 16వ వార్డు ఇసుకతోట, 20వ వార్డు చినవాల్తేరు, 21వ వార్డు పిఠాపురం కాలనీలో యూపీహెచ్‌సీలు



బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ఉన్నాయి. వీటిలో మందులు, వైద్య సిబ్బంది, ల్యాబ్‌లు, 10 పడకలు, సమావేశ గది, మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. ఆయాచోట్ల ప్రజలు అందుబాటులో ఉన్న యూపీహెచ్‌సీలను వినియోగించుకొని వైద్య సేవలు పొందుతున్నారు. జ్వరాలు, బీపీ, మధుమేహం, ఈసీజీ తదితర 60 రకాల వైద్య పరీక్షలు చేసేవారు. ఇదంతా గత ప్రభుత్వ హయాంలో జరిగింది. ఇప్పుడు మాత్రం అన్ని సేవలు అరకొరగానే అందుతున్నాయి.

బోసిపోతున్న ల్యాబ్‌లు

ప్రతీ యూపీహెచ్‌సీలో హెల్త్ ఆఫీసర్‌తో పాటు స్పెషలిస్టు వైద్యులు రాసిన అన్ని రకాల పరీక్షలను రోగులకు అక్కడ ల్యాబ్‌లో ఉచితంగా చేసేవారు. ఇప్పుడు స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో వైద్య పరీక్షలు జరగడం లేదు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, రోగుల సంఖ్య తగ్గింది. దీంతో ల్యాబ్‌లు బోసిపోతున్నాయి.

స్పెషలిస్టుల తొలగింపు



ప్రతీ యూపీహెచ్‌సీలో ఒక హెల్త్ ఆఫీసర్, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది, ఒక సూపర్‌వైజర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక శానిటరీ వర్కర్‌ను నియమించారు. వారితో పాటు వారంలో 8 మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండేటట్లు గత ప్రభుత్వం కాంట్రాక్ట్ విధానంలో నియమించింది. చర్మ వ్యాధులు, ఈఎన్‌టీ, గైనిక్, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, పీడియాట్రిక్స్, జీరియాట్రిక్స్ (వృద్ధుల కోసం), జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు వైద్యులు రోజులో ఇద్దరు చొప్పున అందుబాటులో ఉండేవారు. ప్రస్తుత ప్రభుత్వం వారి సేవలను కొనసాగించకుండా నిలిపివేయడంతో ఆయా రోగాలతో బాధపడే పేద వైద్యులకు యూపీహెచ్‌సీలలో వైద్యం అందడంలేదు. ప్రస్తుతం ఆస్పత్రి వైద్యాధికారులే రోగులకు సేవలు అందిస్తున్నారు.

డాక్టరమ్మను తీసేశారట..

నేను కొద్ది రోజులుగా చర్మ వ్యాధితో బాధపడుతున్నాను. దీని కోసం గతంలో వివేకానందనగర్ ఆరోగ్య కేంద్రానికి వెళ్తే డాక్టరమ్మ మందులు ఇచ్చారు, తగ్గింది. మళ్లీ ఈమధ్య దద్దుర్లు వచ్చాయి. రెండు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్తే గతంలో మందులిచ్చిన డాక్టరమ్మను తీసేశారని చెప్పారు. విమ్స్‌కు వెళ్లమన్నారు. విమ్స్ దూరం కావడంతో ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. మళ్లీ ఆ డాక్టర్‌ను నియమిస్తే మాలాంటి వారికి వైద్యం అందుతుంది. – ఎస్.వరలక్ష్మి, ఆదర్శనగర్

డాక్టర్లు లేక పరీక్షలు చేయడం లేదు

ఆస్పత్రిలో గతంలో ఉన్నట్లు డాక్టర్లు లేరు. ఏ బాధ వచ్చినా ఇక్కడ ఒక్క డాక్టరే అన్నింటికీ చూస్తున్నారు. ఆ డాక్టర్ కొందరికే రక్త పరీక్షలు రాస్తున్నారు. వారే టెస్టులు చేసుకుంటున్నారు. గతంలో వైద్యులు అవసరమైన ప్రతీసారి రక్త పరీక్షలు రాసేవారు. ఇక్కడే పరీక్షలు చేయించుకుని మందులు తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు అలాంటివి లేవు. – కె.కొండమ్మ, రోగి, ఆరిలోవ కాలనీ

స్పెషలిస్టులను నియమించాలి

పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలని యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ సేవలను గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పుడు ఆ సేవలను దూరం చేసి పేదలపై ఆర్థికంగా భారం మోపడం సరికాదు. వెంటనే స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను పునరుద్ధరించాలి. – చింతా వెంకటరావు, ఇసుకతోట

ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

పట్టణ వైద్య కేంద్రాల లక్ష్యానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడిచింది. పది బెడ్‌లతో ఏ చిన్నపాటి జబ్బు నుంచి పెద్ద వ్యాధులకు సైతం వైద్యం అందించే వైద్యకేంద్రాలు ఇప్పుడు జ్వరం ఆసుపత్రులుగా మారిపోయాయి. ఇక్కడ జ్వర పరీక్షలు చేస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్య సేవలను దూరం చేశారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. – ఆనాపు సత్యనారాయణ, కేఆర్‌ఎం కాలనీ

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



స్కూల్ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.వి జయకుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్న సందర్భంగా బుధవారం వాటిని సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, సంస్థలు, కార్యాలయాలు, విద్యాలయాల వద్ద రక్షణగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాఠశాల లోపల, ఇరువైపులా, రోడ్డుపైన, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ప్రెసిడెన్సీ స్కూల్ యాజమాన్యానికి సూచించారు. మారుతీనగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో చిన్నారులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 200 కెమెరాల ఏర్పాటుకు సుమారు మూడు రోజుల సమయం పడుతుందన్నారు. నేరాలు, చోరీలను ఛేదించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

'గౌస్‌ను అధ్యక్షుడిగా గతంలోనే తొలగించాం'

బీచ్‌రోడ్డు: చినవాల్తేరు మహ్మదీయ మసీదు అధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్‌ను ఏపీ వక్ఫ్ బోర్డు ఆదేశాల మేరకు గతంలోనే తొలగించామని మసీదు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. బీజేపీలో గౌస్ చేరిన సందర్భంగా తాను అధ్యక్షుడిగా చెప్పుకున్నారని, అందులో నిజం లేదని కార్యాలయ ప్రతినిధులు స్పష్టం చేశారు. బీజేపీలో గౌస్ వ్యక్తిగతంగా చేరారే తప్ప.. అధ్యక్ష హోదా ఆయనకు లేదని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరైనా మసీదు పేరును తప్పుగా ప్రచారం చేసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: విమ్స్ 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగించడం, ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఇందిరా నగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

జోన్–1 పరిధిలో..

మద్దిలపాలెం: ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏయూ ఇన్‌గేట్ ఫీడర్ 11/33 సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్, బాలాజీనగర్, ఎస్‌బీఐ జోన్ కార్యాలయం, కెనరా బ్యాంకు, వైజాగ్ సెంట్రల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రాజేంద్రనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అమర్‌నగర్, సీబీఎం కాంపౌండ్, మహారాష్ట్ర మండలి, ఆశీల్‌మెట్ట, టింపనీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కొత్త వెంకోజీపాలెంలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–1, సెక్టార్–2 కొత్త వెంకోజీపాలెం చుట్టుపక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిప్రదక్షిణలో ఉచిత వైద్య సేవలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు యాసిన్ తదితరులు

సీతంపేట: ఈ నెల 20న జరగనున్న సింహాచల గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నట్టు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షులు ఎం.డి.యాసిన్ తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీ హెల్త్‌కేర్, ఏజీకేర్ ఫౌండేషన్, ఎరుమేలు శ్రీఅయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్టు సంయుక్త నిర్వహణలో వేలాది మంది భక్తులకు ఆరోగ్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. 12 గంటల పాటు నిర్విరామంగా వైద్యసేవలు అందిస్తామని, 30 మందితో కూడిన 3 వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం తరలించడానికి అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోర్టు స్టేడియం వెనుక రోడ్‌లో వినాయక రెసిడెన్సీ వద్ద నిర్వహించే వైద్య శిబిరంలో సేవలందించడానికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు స్వచ్ఛందగా ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, కమ్యూనిటీ మెడికల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.రాజు, రొటేరియన్స్ శంకర్, కె.ఎం.కె.రమేష్, వి.ప్రవీణ్, సూర్యతేజ పాల్గొన్నారు.

జూ పార్కులో సిద్ధమవుతున్న ఆర్వో ప్లాంట్లు



జూలో ఆఫ్రికన్ చిలకల జోన్‌లో నిర్మించిన ఆర్వో ప్లాంట్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీరు అందించడానికి కొత్తగా మరో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జూ పార్కులో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఉండగా, ఇప్పుడు మరో నాలుగు సిద్ధం చేస్తున్నారు. డివీస్ కంపెనీ సీఎస్సార్ నిధులతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు జూ అధికారులు తెలిపారు. జిరాఫీ ఎన్‌క్లోజర్, జూలో టీ జంక్షన్, ఆఫ్రికన్ చిలకల జోన్, కోతుల జోన్ వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్లాంట్ల నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇవి జూలో సందర్శకులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆర్వో ప్లాంట్లు కూడా అందుబాటులోకి వస్తే జూలో మొత్తం ఎనిమిది చోట్ల ఆర్వో ప్లాంట్ల ద్వారా సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి వస్తుందని జూ అధికారులు తెలిపారు.

ఏయూ వీసీగా దళితుడికి అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్(వీసీ)గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశమివ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డిమాండ్ చేసింది. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏయూ వీసీ రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులు, శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఆంధ్ర యూనివర్సిటీకి ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి గొప్ప వ్యక్తులను ఏయూ తయారు చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలన్నారు. 25 ఏళ్లుగా ఓసీ, బీసీలకు చెందిన వారే వీసీలుగా ఉన్నారని, ఈ సారి దళితులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకులకు కౌన్సెలింగ్

సీపీ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు అన్ని స్టేషన్లలో చీటీల నిర్వాహకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేస్తున్నారు. గతంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడంతో బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తెలిసిందే. రోజువారీ కూలీలు, ఇతర వృత్తిదారులు తమ పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాల నిమిత్తం చీటీలు వేస్తుంటారు. దసరా, సంక్రాంతి, వరలక్ష్మీ వ్రతం వంటి నగదు చీటీలు కడుతుంటారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు విశాఖకు వలస వచ్చి చిన్న చిన్న పనులు, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని చీటీల రూపంలో పొదుపు చేసుకుంటున్నారు. వీరి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు చీటీ నిర్వాహకులు అర్ధాంతరంగా బిచాణా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్య..

ప్రభుత్వ లైసెన్స్ లేని చీటీ నిర్వాహకులంతా చీటీలు వేయకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని స్టేషన్లకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు ద్వారకా జోన్.. ఇటు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో చీటీల నిర్వాహకుల తాకిడి కనిపిస్తోంది. పోలీసులు వీరికి రోజూ కౌన్సెలింగ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఎక్కడో ఒక చోట చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడం ఆనవాయితీగా మారిపోయింది. పలు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ లైసెన్స్ తీసుకున్న తరువాతే చీటీలు నిర్వహిస్తుంటారు. కానీ నివాసాల మధ్య కొందరు చీటీల నిర్వాహకులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే దర్జాగా చీటీ పాటలు వేస్తూ.. అమాయక ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారింది.



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్

మోసపోవద్దు.. మేల్కొండి

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో చీటీల నిర్వాహకులు ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఎవరైనా చీటీల నిర్వాహకులు పాటదారులకు వెంటనే సొమ్ములు చెల్లించాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. నగర సీపీ ముందు జాగ్రత్త చర్యగా చీటీల నిర్వాహకులను మొదట్లోనే కట్టడి చేస్తే మోసాలకు ఆస్కారం లేకుండా చేయొచ్చని యోచిస్తున్నారు. ప్రభుత్వ లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద చీటీలు వేసి మోసపోవద్దని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. చీటీలు వేసి మోసపోయిన తరువాత తమను ఆశ్రయించడం కన్నా.. ముందే మేల్కోవాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు రూ.1.10 లక్షలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్‌కు, నగరంలోని మహారాణిపేటకు చెందిన వి.సూర్య ఉమాభారతి అనే దాత రూ.లక్ష విరాళ చెక్కును అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకు అందించారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జీవో 21ని తక్షణమే రద్దు చేయాలి




మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: వాహనదారులపై జరిమానాలు విధించే జీవో నంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణ పేరుతో అధిక జరిమానాలు విధిస్తూ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవో 21ని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ నెపంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణ శాఖాధికారులు, వాహన యజమానులు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు పీఎఫ్. ఈఎస్ఐతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు, అద్దూరి శంకర్, ఉపాధ్యాక్షుడు లంక గోవింద్, కోశాధికారి ఎస్.మధురెడ్డి, కమిటీ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, జి.శ్రీను, పి.కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జగదాంబ: ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకులు అవగాహన కలిగి ఉండాలని జోన్–3 ఏసీపీ రాజీవ్‌కుమార్ అన్నారు. సడన్ అండ్ సర్‌ప్రైజ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం టౌన్ కొత్తరోడ్డు వద్ద వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ట్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడిపే వారికి అపరాధ రుసుము విధిస్తామన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ఎస్ఐవిశ్వనాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టౌన్ కొత్తరోడ్డు వద్ద వాహన చోదకులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

శ్రీవిద్య ఉపాసన తరగతులు ప్రారంభం



ఉపాసన తరగతుల్లో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ఉపాసనలో మిడ్ లెవెల్ కోర్స్ బుధవారం ప్రారంభించినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఈ శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చిన 16 మంది విద్యార్థులకు అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా గురుమంత్ర దీక్ష ఇచ్చి తరగతులు ప్రారంభించారు. దీక్షలో సౌదీ అరేబియా, యూఎస్ఏలతోపాటు దేశంలోని వివిధ నగరాల నుంచి వచ్చిన వారు పాల్గొన్నారు.